క్లుప్తంగా

సమాన వాటా కోసమే సంతకాల సేకరణ

కర్నూలు కల్చరల్‌: రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాల్లో సమాన వాటా కల్పించాలని రాయలసీమ స్టీరింగ్‌ కమిటీ నాయకులు సీమకృష్ణ డిమాండ్‌ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బిర్లా కాంపౌండ్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్టీరింగ్‌ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. రాయలసీమ 8 జిల్లాల్లోని 52 నియోజకవర్గాల్లో ఐదు లక్షల మందితో సంతకాలను సేకరించి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకు అందజేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే రాయలసీమ స్టీరింగ్‌ కమిటీ చైర్మన్‌ బైరెడ్డి రాజశేఖర్‌ రెడ్డి ఆధ్వర్యంలో అమరావతిలో నిరసన దీక్ష చేపడతామని వెల్లడించారు. నాయకులు కిషోర్‌ యాదవ్‌, కురుబ బాబు, గణేష్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

హజ్‌ యాత్రికులకు సాయంపై హర్షం

కర్నూలు(రాజ్‌విహార్‌): పవిత్ర హజ్‌ యాత్రకు వెళ్లే వారికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని ఆలిండియా మిల్లీ కౌన్సిల్‌ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అబ్దుల్‌ ఖదీర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హజ్‌ యాత్ర చేయడం ప్రతి ముస్లిం హక్కు అని, ఆర్థిక సమస్యలతో యాత్రకు వెళ్లేందుకు అనేక మంది వెనుకాడుతారని పేర్కొన్నారు. ఇలాంటి వారికి చేయుతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.80 వేలు అందిస్తోందని, ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్‌ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్‌): విద్యుత్‌ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌ అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ నాగప్రసాద్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పరిధిలోని రామచంద్ర నగర్‌, రామకృష్ణా నగర్‌, శివరామాలయం వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ కోతలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించండి

కర్నూలు(రాజ్‌విహార్‌): వేసవిలో ఎండ, వేడి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కార్మికులకు రక్షణ కల్పించాలని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్‌ కె.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా కార్మికులు వడదెబ్బకు గురి కాకుండా చూడాలని, పని ప్రదేశాల్లో మంచినీరు, ఓఆర్‌ఎస్‌, మజ్జిగ, కూలింగ్‌ సెల్లార్లు వంటివి సమకూర్చాల్సిన బాధ్యత యజమానులు, కాంట్రాక్టు ఏజెన్సీలపై ఉందని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలు, ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులకు పని వేళల్లో మార్పులు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను విస్మరిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

విద్యుత్‌ బిల్లులు చెల్లించండి

కర్నూలు(రాజ్‌విహార్‌): విద్యుత్‌ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ పురోగతికి సహకారం అందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ వై.సుబ్బన్న శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నెలవారి బిల్లుల జారీ ప్రక్రియ పూర్తి చేసి డిమాండ్‌ నోటీసులు జారీ చేశామని, బిల్లుల్లో పేర్కొన్న తేదీల్లోపు డబ్బు చెల్లించాలని కోరారు. ఏపీఎస్పీడీసీఎల్‌ వెబ్‌సైట్‌, ఇతర మొబైల్‌ వాలెట్ల ద్వారా విద్యుత్‌ బిల్లులు చెల్లించవచ్చని సూచించారు.

జేవీడీ పెండింగ్‌ లేకుండా చూడండి

కర్నూలు(అర్బన్‌): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల చివరి వారంలో విడుదల చేయనున్న జగనన్న విద్యా దీవెన (జేవీడీ) పథకాన్ని అర్హులైన విద్యార్థులందరికీ అందించేందుకు వీలుగా జిల్లాలో ఎలాంటి పెండింగ్స్‌ లేకుండా చూడాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్‌ డైరెక్టర్‌ శ్రీనివాసన్‌ ఆదేశించారు. శుక్రవారం ఆయన అమరావతి డైరెక్టరేట్‌ నుంచి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలకు చెందిన అధికారులతో జూమ్‌ కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అర్హత కలిగిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రెండవ విడత ఫీజు మొత్తాలను జమ చేయనున్న నేపథ్యంలో ఇంకా ఎక్కడైనా విద్యార్థులకు సంబంధించి ఈ-కేవైసీ, ఆధార్‌ మ్యాపింగ్‌, డీడీఓ స్థాయిలో దరఖాస్తులు పెండింగ్‌ లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా వివిధ విశ్వ విద్యాలయాల్లో ఫీజు స్ట్రక్చర్‌ మ్యాపింగ్‌పై కూడా దృష్టి సారించి పరిశీలించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా దీవెన అందించేందుకు సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయాలన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్‌: బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఫాస్ట్‌ ఎక్స్‌, విరుపాక్ష, ది కేరళ స్టోరీ, పొన్నియిన్‌ సెల్వన్‌-2, గార్డియన్స్‌ ఆఫ్‌ గెలాక్సీ-3, సింహాద్రి
వి మెగా ఆనంద్‌ సినీ కాంప్లెక్‌ : కస్టడీ, ఫాస్ట్‌ ఎక్స్‌, బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఉగ్రం, విరుపాక్ష, ది కేరళ స్టోరీ, సింహాద్రి
వెంకటేష్‌ సినీ కాంప్లెక్స్‌: బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, విరుపాక్ష
ఐనాక్స్‌ : ఫాస్ట్‌ ఎక్స్‌, ది కేరళ స్టోరీ, ఉగ్రం, హసీనా, గార్డియన్స్‌ ఆఫ్‌ గెలాక్సీ-3
భరత్‌ కాంప్లెక్స్‌ : ది కేరళ స్టోరీ, విరుపాక్ష, సింహాద్రి
శ్రీరామ : సింహాద్రి
రాజ్‌ : ఫాస్ట్‌ ఎక్స్‌
విజయ : ది కేరళ స్టోరీ

కళ్లకు కూల్‌గా..

- వేసవిలో బయటకు వెళ్లేటప్పుడు సన్‌ గ్లాసెస్‌ పెట్టుకోవాలి
- ద్విచక్ర వాహనదారులకు కంటి రక్షణ తప్పనిసరి
- తీవ్రమైన ఎండ పొడతో రెటీనాకు ముప్పు

కర్నూలు (న్యూసిటీ): మనిషి దేహంలోని అన్ని ఇంద్రియాల్లో కళ్లు ప్రధానమైనవి. అంతటి ప్రాధాన్యత కలిగిన కళ్లను వేసవిలో సంరక్షించుకోవడం ముఖ్యం. ముఖ్యంగా వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టకపోతే చూపు పోయే ప్రమాదం ఉంది. ఎండలో ఎక్కువ సమయం తిరిగితే కళ్లలో శుక్లాలు (కాటరాక్ట్‌) వచ్చే అవకాశాలు ఉన్నాయి. గ్లకోమా సమస్య ఉన్నవారికి ఎండ పొడ నేరుగా తగిలితే కళ్లు పొడిబారి రెటీనా దెబ్బతిన్నడంతో చూపు మందగిస్తుంది. బయటకు వెళ్లేటప్పుడు సరైన కళ్లద్దాలు పెట్టుకుంటే ఈ సమస్యల నుంచి బయటపడొచ్చు.

కంటిని నలపరాదు

చాలా మంది కళ్లను అస్తమానం నలుపుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల చేతులకుండే దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా వంటివి కళ్లకు అంటుకొని ఇన్‌ఫెక్షన్లు వస్తాయి. బయటకు వెళ్లేటప్పుడు దుమ్ము, ధూళి పడి కళ్లు ఎర్రబడి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉటుంది. ఈ సమస్యల నుంచి తప్పించుకోవాలంటే సన్‌గ్లాసెస్‌ తప్పనిసరిగా వాడాలి.

మార్కెట్‌లో వివిధ కంపెనీల కళ్లద్దాలు

మార్కెట్‌లో రెబాన్‌, ఒకేలే, మౌజింగ్‌, వోగ్‌, టైటాన్‌, ఫాస్ట్రాక్‌, ఆరెక్స్‌ తదితర సన్‌ గ్లాసెస్‌ అందుబాటులో ఉన్నాయి. వీటిని గాజు లేదా ఫైబర్‌తో తయారుచేస్తారు. ధరలు.. ఆయా కళ్లద్దాల ప్రత్యేకతలు, స్టైలిష్‌ డిజైన్‌, నాణ్యత, కూలింగ్‌ కోటింగ్స్‌ను బట్టి రూ.999 నుంచి మొదలుకుని వేలల్లో ఉన్నాయి. గాజు అద్దాలు అయితే తొందరగా కూలింగ్‌ అవుతుంది. సూర్య కిరణాలు, లైట్‌ ఎఫెక్ట్‌ నేరుగా కళ్లపై పడకుండా నివారిస్తుంది.

ఏ అద్దాలు బెటరంటే..

సన్‌ గ్లాసెస్‌ ఎండ నుంచి కళ్లకు రక్షణ కల్పిస్తాయి. అన్ని రకాల గ్లాసెస్‌ ఉపయోగించవచ్చని చెప్పలేం. ఎండ నుంచి రక్షణ పొందాలంటే పోలరైజ్డ్‌ లెన్స్‌ ఉన్న అద్దాలను ఎంచుకోవాలి. ల్యామినేటర్‌ ఫిల్టర్స్‌తో ఈ అద్దాలను తయారు చేస్తారు. అవి కళ్లలోకి చొచ్చుకుపోయే కొన్ని కిరణాలను అడ్డుకుంటాయి. ఎండ, నీళ్లు, తేమ నుంచి వచ్చే మెరుపు కంటిని తాకకుండా చేయడంతో పాటు వంద శాతం యూవీ ప్రొటెక్షన్‌ ఉంటుంది. ఈ లెన్స్‌తో ఉన్న సన్‌గ్లాసెస్‌ పెట్టుకుంటే కళ్లపై ఎక్కువ ఒత్తిడి పడదు. విజువల్‌ క్లారిటీ బాగుంటుంది.


షోరూంలో విక్రయానికి ఉంచిన చలువ కళ్లద్దాలు


సన్‌ గ్లాసెస్‌ కొనుగోలు చేస్తున్న మహిళలు

ఎండ నుంచి కాపాడుతుంది



ఎండా కాలంలో పనుల నిమిత్తం బయటకు రాలేకపోతున్నాం. అందుకే కళ్ల అద్దాలు తీసుకోవడానికి వచ్చాం. ఇక్కడ రకరాల కళ్ల అద్దాలు ఉన్నాయి. ఎండ నుంచి కంటికి రక్షణ కల్పిస్తుందని రెబన్‌ సన్‌గ్లాసెస్‌ తీసుకున్నాం.
– శిరీష, కర్నూలు

ఎండాకాలంలో గిరాకీ



గతంలో ప్రముఖులు, వ్యాపార వేత్తలు, ఉద్యోగులు మాత్రమే సన్‌ గ్లాసెస్‌ వాడేవారు. ప్రస్తుతం ప్రతిఒక్కరూ కళ్ల అద్దాలను ఎక్కువగా వాడుతున్నారు. ఎండా కాలంతో మాత్రం అద్దాలు అధిక సంఖ్యలో అమ్ముడుపోతాయి. మిగతా సమయాల్లో వ్యాపారం తక్కువగా ఉంటుంది.
– జయంత్‌, షాపు మేనేజర్‌

పరీక్ష చేయించుకుని అద్దాలు కొనాలి



కంటి అద్దాలు తీసుకునేవారు తప్పనిసరిగా కంటి వైద్యులచే పరీక్ష చేయించుకోవాలి. పరీక్ష చేయించుకోకుండా అద్దాలు తీసుకుంటే తలనొప్పి, మెల్ల కన్ను, కళ్లు ఒత్తిడికి గురికావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. 40 ఏళ్లలోపు వారు మెనోఫోకల్‌, 40ఏళ్లు పైబడినవారు బైఫోకల్‌ లేదా ప్రోగ్రెసివ్‌ అద్దాలు వాడాలి. ఎండలో పనిచేసే వారు యూవీ ప్రొటెక్షన్‌ లేదా ప్రోటోక్రోమిక్‌ గ్లాసెస్‌ తీసుకోవాలి. కంప్యూటర్‌పై పని చేసేవారు, రాత్రిపూట డ్రైవింగ్‌ చేసేవారు యాంటీగ్లేర్‌ అద్దాలు వాడితే మంచింది. చిన్నపిల్లలు, క్రీడాకారులు పాలికార్బోనెటెడ్‌ గ్లాసెస్‌ లేదా సేఫ్టీ అద్దాలు వాడితే కంటికి రక్షణగా ఉంటుంది.
– డాక్టర్‌. ఎస్‌ మున్నీరాభేగం

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

కర్నూలు(సెంట్రల్‌): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు సంబంధించి బిలో బేస్‌మెంట్‌ లెవల్‌ (బీబీఎల్‌) నుంచి బేస్‌మెంట్‌ లెవల్‌ (బీఎల్‌) కన్వర్షన్‌ పనుల పురోగతిలో ఎంపీడీఓలు, బేస్‌మెంట్‌ లెవల్‌ నుంచి కంప్లీషన్‌ వరకు హౌసింగ్‌ ఇంజినీర్లు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్‌ ద్వారా ఎంపీడీఓలు, హౌసింగ్‌ ఏఈలు, ఉపాధి సిబ్బందితో హౌసింగ్‌, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణ పనుల్లో ప్రతిరోజూ స్టేజ్‌ కన్వర్షన్‌లో పురోగతి సాధించాలన్నారు. రెండు రోజులుగా స్టేజ్‌ కన్వర్షన్‌లో వెనుకబడిన చిప్పగిరి, కోడుమూరు, హాలహర్వి, నందవరం మండలాల అధికారులతో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. శనివారం వరకు సమయం కావాలని వారు కోరడంతో అందుకనుగుణంగా పనిచేయాలని సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడి పనులను వేగవంతం చేయించాలని ఆదేశించారు. మే నెలాఖరుకల్లా 11,646 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారని. ఇందులో గూడూరు అర్బన్‌, కోడుమూరు మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. పనులు వేగవంతం చేయడంలో ఆయా మండలాల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోసిగి, ఆదోని, కోడుమూరు మండలాల ఎంపీడీఓలను ఆదేశించారు. వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్దేశించిన షెడ్యూల్‌ ప్రకారం నిర్వహించేందుకు ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్‌ పీడీ వెంకటనారాయణ,డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి ఉన్నారు.

పేదల స్థలాలపై హేళన తగదు



అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్‌): రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో పేదలకు పంపిణీ చేసే స్థలాలపై మాజీ సీఎం చంద్రబాబునాయుడు హేళనగా మాట్లాడడం తగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సీహెచ్‌ మద్దయ్య అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం స్థానిక పాతబస్టాండ్‌ వద్ద ఉన్న అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ముందుగా అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇచ్చే ఇళ్లను సమాధులతో పోల్చి చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. 14 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు ఇళ్లు లేని పేదలకు సెంటు స్థలం ఇవ్వలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల కోసం లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తోందని వివరించారు. జగనన్న కాలనీల పేరుతో ఊర్లు నిర్మించి పేదలకు ఇస్తుంటే ఓర్వలేని చంద్రబాబు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు, లోకేష్‌ తమ నోరు అదుపులో పెట్టుకోవాలని, అనవసర వ్యాఖ్యలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మాజీ మేయర్‌ బంగి అనంతయ్య, కార్పొరేటర్లు రాజేశ్వర రెడ్డి, కృష్ణకాంత్‌ రెడ్డి, షేక్‌ అహ్మద్‌, యూనుస్‌, పార్టీ నాయకులు ప్రసాద్‌, కేదార్‌నాథ్‌, విజయలక్ష్మి, పర్వేజ్‌, ఫిరోజ్‌, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ మోటార్స్‌ సిల్వర్‌ జూబ్లీ ఉత్సవాలు

కర్నూలు (టౌన్‌): మారుతీ సుజుకీ అధీకృత డీలర్‌ ఎంఎస్‌పీ మోటార్స్‌ స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సిల్వర్‌ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ షావాజ్‌ అలీఖాన్‌ ఆటోషో, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా మారుతీ సుజుకీ డీలర్‌గా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించామన్నారు. సిల్వర్‌ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 19 నుంచి 31వ తేదీ వరకు బుకింగ్‌ చేసుకున్న అన్ని మోడల్స్‌పై 10 గ్రాముల సిల్వర్‌ కాయిన్‌ అందిస్తున్నట్లు చెప్పారు.


రక్తదానం చేస్తున్న మారుతీ సుజుకీ సంస్థ ఉద్యోగులు

సంస్థ జనరల్‌ మేనేజర్‌ కళ్యాణ్‌ పాల్గొన్నారు. అనంతరం సంస్థ ఉద్యోగులు రక్తదానం చేశారు.

కార్యాలయాల నిర్మాణం పూర్తి చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్‌ జి.సృజన

కర్నూలు(సెంట్రల్‌): రూఫ్‌ లెవల్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను సెప్టెంబర్‌ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల అంశంపై పీఆర్‌ ఇంజినీర్లతో ఆమె సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. మండలాల వారిగా భవన నిర్మాణాల వివరాలను తనకు నివేదించాలని పీఆర్‌ ఎస్‌ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు. నాడు-నేడు రెండో దశ కింద అన్ని పాఠశాలల్లో విద్యుత్‌, తాగునీరు, పెయింటింగ్‌, టాయిలెట్స్‌ విత్‌ రన్నింగ్‌ వాటర్‌ తదితర మౌలిక సదుపాయాల పనులను మే 31 లోపు పూర్తిచేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలు నివారించండి

కర్నూలు(సెంట్రల్‌): జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజన అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులు 40, 44లలో బారికేడింగ్‌, హైమాస్‌ లైట్ల ఏర్పాటుపై కలెక్టర్‌ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరగక ముందే నివారణ చర్యలు చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోవకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నన్నూరులో ఆరు నెలల నుంచి హైమాస్‌ లైట్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఎందుకు చేపట్టలేదని జాతీయ రహదారుల అధికారులను నిలదీశారు.

ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్లపై శ్రద్ధ

కర్నూలు(సెంట్రల్‌): ఉల్లి, టమాటాలతో పాటు వివిధ రకాల కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్ల స్థాపనపై ప్రత్యేక శద్ధ తీసుకోవాలని కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజన డీఆర్‌డీఏ, మెప్మా అధికారులను ఆదేశించారు. పొదుపు మహిళలకు వివిధ రకాల ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో వివిధ అంశాలపై డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో ఆమె సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎస్‌హెచ్‌జీ మహిళలు అప్పటికే వేర్వేరు కారణాలతో లోన్‌ తీసుకొని ఉంటే ఎలా చేయాలనో ఆలోచన చేయాలని మెప్మా, డీఆర్‌డీఏ, హౌసింగ్‌ ప్రత్యేకాధికారి మల్లికార్జునుడుని ఆదేశించారు. టిడ్కో గృహాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను బ్యాంకులకు పంపి మేనేజర్లతో మాట్లాడి లోన్‌ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెప్మా పీడీ నాగశివలీల, డీఆర్‌డీఏ పీడీ ఎం.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే విజయం మీదే

కర్నూలు రూరల్‌: ఉద్యోగార్థులు పట్టుదలతో ప్రతి అంశాన్ని కూలంకషంగా చదవాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం నగరంలో బిర్లా గేట్‌లోని విజేత స్టడీ సర్కిల్‌లో నూతన గ్రూప్‌-2 సిలబస్‌పై డీవైఎఫ్‌ఐ-ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీఎఫ్‌ ఎమ్మెల్సీ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ .. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి సిలబస్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. నేర్చుకున్న ప్రతి విషయాన్ని తరగతి గదిలో చర్చించడం ద్వారా ఆ అంశంపై పట్టు వస్తుందన్నారు. అనంతరం విజేత స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ గోవిందు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ పంపిణీ చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నగర అభివృద్ధే ధ్యేయం

కల్లూరు: కర్నూలు నగర అభివృద్ధే ధ్యేయంగా కష్టపడి పనిచేస్తున్నామని మేయర్‌, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్‌ 19వ వార్డు మదర్‌ల్యాండ్‌లో రూ.50 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ.. నగర పాలకవర్గం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కర్నూలును ఆదర్శంగా నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నామని, నగర రహదారుల విస్తరణ, పార్కులను నిర్మించడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొందన్నారు. గత రెండేళ్లలో రూ.506 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 15 ఎంఎల్‌డీ వాటర్‌ ట్రీట్మెంట్‌ ప్లాంట్‌ పూర్తయ్యిందని వచ్చే వారం ప్రారంభిస్తామన్నారు.

కల్లూరులో పురోగతి

వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో కల్లూరు అర్బన్‌ ప్రాంతం ఎంతో పురోగతి సాధించిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. తాగునీటి సమస్య చాలా వరకు పరిష్కరించామన్నారు. 16 వార్డుల్లో రూ.31.34 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. జగన్నాథ గట్టు మీద 50 ఎంఎల్‌డీ వాటర్‌ ట్రీట్మెంట్‌ ప్లాంట్‌, అలాగే నగరంలో 21 తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.115 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులు పూర్తయితే కల్లూరుతో పాటు నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. డిప్యూటీ మేయర్‌ ఎస్‌.రేణుక, డీఏఏబీ చైర్మన్‌ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, ఎస్‌ఈ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈ శేషసాయి, డీఈఈ రవిప్రకాష్‌ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, హనుమంతురెడ్డి, శివరాం స్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్‌ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌ రెడ్డి

టీపీఎస్‌గా పదోన్నతి

కర్నూలు (టౌన్‌): నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం బిల్డింగ్‌ ఇన్‌స్పెక్టర్‌ టీ.హరీష్‌ చౌదరికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. శుక్రవారం టౌన్‌ ప్లానింగ్‌ డైరెక్టర్‌ ఆర్‌.జె.విద్యుల్లత ఆయనకు సూపర్‌వైజర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థలో బిల్డింగ్‌ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన 2020 అక్టోబర్‌ 9 నుంచి పనిచేస్తున్నారు.

విద్యుత్‌ చార్జీలు తగ్గించండి

కర్నూలు(న్యూసిటీ): ప్రజలకు భారంగా ఉన్న విద్యుత్‌ చార్జీలను తగ్గించి, నాణ్యమైన కరెంట్‌ సరఫరా చేయాలని కర్నూలు పార్లమెంట్‌ టీడీపీ అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం గాయత్రీ ఎస్టేట్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పెంచిన కరెంట్‌ చార్జీలను తగ్గించాలని, చెత్త పన్ను రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. టీడీపీ నాయకులు సోమిశెట్టి నవీన్‌, కె.చంద్రకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

త్రీటౌన్‌ సీఐగా మరళీధర్‌ రెడ్డి

కర్నూలు: కర్నూలు మూడవ పట్టణ పోలీస్‌ స్టేషన్‌ సీఐగా మురళీధర్‌ రెడ్డి నియమితులయ్యారు. కర్నూలు రేంజ్‌ డీఐజీ సెంథిల్‌కుమార్‌ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ మేరకు ఎస్పీ కృష్ణకాంత్‌ బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. 1996లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరిన ఈయన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. 2008 నుంచి 2010 వరకు త్రీటౌన్‌ ఎస్‌ఐగా కూడా పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడున్న తబ్రేజ్‌ను వీఆర్‌కు నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈయన 2019 అక్టోబర్‌ 17 నుంచి దాదాపు మూడుసంవత్సరాల ఏడు నెలల పాటు విధులు నిర్వహించారు. ఈనెల 22వ తేదీన మురళీధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

రగ్బీలో పతకాలు సాధించాలి

కర్నూలు రూరల్‌: కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈనెల 27, 28 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పురుషుల పోటీలలో పతకాలు సాధించాలని రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సురేందర్‌ అన్నారు. శుక్రవారం స్థానిక బి.క్యాంప్‌ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు సూచనలు, మెలకువలు నేర్పించారు. ఈ జట్టుకు మేనేజర్‌గా కిరణ్‌ను ఎంపిక చేశారు. పురుషుల జట్టు తరపున వంశీ, రాఘవేంద్ర, రహమతుల్లా, శ్రీకాంత్‌, రఘు, భరత్‌, సూర్యప్రకాష్‌, సునిల్‌, సుధాకర్‌, రమేష్‌, సురేంద్ర పాల్గొననున్నారు.

21న ఎంపిక పోటీలు

కర్నూలు రూరల్‌: విజయవాడ నగరంలో 8వ సీనియర్‌ అంతర్‌ జిల్లా ఈత పోటీలను జూన్‌ 10న నిర్వహించనున్నట్లు జిల్లా స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు నరసింహాచారి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా జట్టును ఈనెల 21వ తేదీన కిసాన్‌ ఘాట్‌లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈత కొలనులో పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 91540 76117 ఫోన్‌ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

కోడుమూరు రూరల్‌: కోడుమూరు పట్టణంలో నిర్మిస్తున్న ధర్మపురి క్షేత్ర అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కర్నూలు పార్లమెంట్‌ సభ్యుడు డాక్టర్‌ సంజీవ్‌కుమార్‌ రూ.5 లక్షలు విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆలయ నిర్మాణం అద్భుతంగా కొనసాగుతోందన్నారు. ఇందుకు తన వంతుగా విరాళం అందించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు భాస్కర్‌రెడ్డి, జీతూరి రవికుమార్‌, నాగరాజు, రాఘవేంద్ర, మోహన్‌ తదితరులు ఉన్నారు.


కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కర్నూలు ఎంపీ డాక్టర్‌ సంజీవ్‌కుమార్‌

రైతులకు నాణ్యమైన ఉత్పత్తులనే అందించాలి

కర్నూలు(అగ్రికల్చర్‌): వ్యవసాయంలో రైతుల రాణింపు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతోనే సాధ్యమని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌ జేడీఏ కృపాదాస్‌ తెలిపారు. ఖరీఫ్‌ సీజన్‌ సమీస్తున్న నేపథ్యంలో ఈ విషయమై జిల్లా స్థాయిలో ఏవో, ఏడీఏలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్వాలిటీ కంట్రోల్‌పై నగరంలోని ఉద్యాన భవన్‌లో కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యవసాయ అధికారులు, ఏడీఏలకు ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. కమిషనరేట్‌ అధికారుల బృందం క్వాలిటీ కంట్రోల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృపాదాస్‌ మాట్లాడుతూ చట్టాలకు అనుగుణంగా దుకాణాలను నిర్వహించాలని, అనుమతించిన కంపెనీల ఉత్పత్తులు మాత్రమే షాపుల్లో ఉంచాలన్నారు. చట్టాలపై క్వాలిటీ కంట్రోల్‌ అధికారులకు పూర్తిగా పట్టు ఉన్నప్పుడే తనిఖీలను సమర్థవంతంగా నిర్వహించే వీలుంటుందన్నారు. నెలవారీగా శాంపిల్స్‌ తీయడంపై లక్ష్యాలు ఇచ్చామని, ఆ మేరకు సేకరించి ల్యాబ్‌లకు పంపాలన్నారు. వర్క్‌షాప్‌లో కర్నూలు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్‌ వరలక్ష్మి, నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, కమిషనరేట్‌ ఏడీఏలు రాజన్‌, సుదర్శన్‌రాజు, మద్దిలేటి,ఏవోలు సురేష్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనరేట్‌ జేడీఏ కృపాదాస్‌

దోమలను అరికట్టాలి

కర్నూలు (హాస్పిటల్‌): దోమలు ఉత్పత్తికాకుండా అరికట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి డాక్టర్‌ వై.ప్రవీణ్‌కుమార్‌ సూచించారు. ఆయన శుక్రవారం నగరంలోని హౌసింగ్‌ బోర్డు కాలనీలో జరుగుతున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో కలిసి గృహాలను సందర్శించి నీటి నిల్వలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. వైద్యాధికారి డాక్టర్‌ మానిక, డిస్ట్రిక్‌ కమ్యూనిటీ మొబిలైజర్‌ ప్రసాద్‌ తదితరులు ఉన్నారు.

పదోన్నతులపై స్పష్టత ఇవ్వాలి

కర్నూలు సిటీ: పదోన్నతులపై రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు గందరగోళానికి గురౌతున్నారని, అంశంపై స్పష్టత ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న డిమాండ్‌ చేశారు. శుక్రవారం స్థానిక సలాంఖాన్‌ భవనంలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బదిలీల విషయంలో ఉపాధ్యాయులందరికీ న్యాయం జరిగే విధంగా సమగ్రమైన ఉత్తర్వులు రూపొందించాలని కోరారు. సంఘం నాయకులు గోకారి, జనార్ధన్‌, పాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సమస్యలు పరిష్కరించండి

కర్నూలు(రాజ్‌విహార్‌): విద్యుత్‌ వినియోగదారులకు అందుబాటులో ఉంటేనే వారి సమస్యలు తెలుస్తాయని దక్షిణ ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్‌ ఎస్‌ఈ ఎం.ఉమాపతి సూచించారు. శుక్రవారం ఆయన విద్యుత్‌ భవన్‌ నుంచి కింది ఈఈ, డీఈఈలు, ఏఈఈలతో టెలీ కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. వేసవిలో విద్యుత్‌ డిమాండ్‌ పెరగడం, ఓవర్‌ లోడు వంటి కారణాలతో సాంకేతిక సమస్యలు తలెత్తుతుంటాయని, బ్రేక్‌ డౌన్స్‌, ట్రిప్పింగ్స్‌, ఫ్యూజులు కాలిపోవడం వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

- విద్యుత్‌ అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఎస్‌ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. స్థానిక పవర్‌ హౌస్‌లో కర్నూలు ఆపరేషన్స్‌ డివిజన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్లు, డీఈఈలు, ఏఈఈలతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్‌ పనుల్లో నాణ్యత పాటించాలని, పనులు పూర్తయిన వెంటనే వర్క్‌ ఆర్డర్లు క్లోజ్‌ చేయాలని, నెలవారీ బిల్లులను 100 శాతం రాబట్టాలని సూచించారు. కర్నూలు ఆపరేషన్స్‌ ఈఈ రమేష్‌, డీఈఈలు రాజమోహన్‌రెడ్డి, వై.సుబ్బన్న, ఏఈలు పాల్గొన్నారు.